డీఈఈ సెట్ నోటిఫికేషన్

తిమ్మాపూర్ జూన్7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి 'డీఈఈ సెట్-2024' నోటిఫికేషన్ విడుదలైందని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలతోపాటు పలు ప్రైవేట్ కళాశాల్లో రెండు సంవత్సరాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యర్థులకు ఇంటర్‌లో 50 శాతం మార్కులు ఉండాలని, షెడ్యూల్డ్ కులాలు, దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం మార్కులు ఉండాలన్నారు. సెప్టెంబర్ ఒకటో తేది నాటికి విద్యార్థి వయసు కనీసం 17 సంవత్సరాలు ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 10న ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో http://deecet.cdsc.Telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాషింగ్టన్‌లో కొండూరి

ప్రపంచ బ్యాంకు అధికారుల సమావేశానికి హాజరు



వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధికారులతో కొండూరి

కరీంనగర్ విద్యానగర్, జూన్ 7: యూఎస్‌లోని వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధికారులతో జరిగిన సమావేశాలకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ అలయన్స్ (ఐసీఏ)కు అనుబంధమైన ఇంటర్నేషన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అసోసియేషన్ (ఐసీబీఏ) ప్రతినిధి బృందం యూఎస్‌లోని వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధికారులతో ఈ నెల 4 నుంచి 6 వరకు సమావేశాలు నిర్వహించింది. వీటికి ఐసీబీఏ ప్రెసిడెంట్ భీమా సుబ్రమణ్యం, ఐసీఏ ఎండీ బ్రెస్సెల్స్, ఐసీబీఏ బోర్డు సభ్యులు కబీర్ అయిండే తుకూర్ తదితరులతో కలిసి కొండూరి హాజరయ్యారు. ఈవెంట్లలో ప్రపంచ బ్యాంకు పోషించే పాత్రలపై చర్చించారు. నవంబర్‌లో ఢిల్లీలో సమావేశం కావాలని అంగీకారం తెలిపారు. డేటా సేకరణపై దృష్టి, సభ్యత్వాన్ని పెంచి అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం చేయాలని చర్చించారు.

ఎన్నికల నిధులు హాంఫట్?

జగిత్యాల జిల్లాలో మరో అవినీతి బాగోతం!



- అసెంబ్లీ ఎలక్షన్ల సమయంలో స్వాహా పర్వం
- డివిజన్ స్థాయి అధికారితోపాటు మరో అధికారిపై ఆరోపణలు
- లక్షలాది రూపాయలు పక్కదారి
- ఆ తర్వాత బదిలీ పేరిట జంప్!
- డబ్బుల కోసం ఆఫీసుల చుట్టూ బాధితులు
- అప్పటి అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువు • ఆదుకోవాలని వేడుకోలు

జగిత్యాల, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహణకు ప్రతి నియోజకవర్గానికి నిధులు కేటాయించింది. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను డీడీవో (డ్రాయింగ్ అండ్ డిశ్చార్జీ ఆఫీసర్)లుగా నియమించారు. వారి పేరిట అకౌంట్‌ను ఓపెన్ చేయించి నిధులను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఒక్కో నియోజకవర్గానికి ₹కోటీ 60 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఎన్నికల సిబ్బందికి భోజనాలు నుంచి మొదలు కొని అన్ని వ్యవహారాలు నిర్వహించాల్సి ఉంటుంది. పోల్ చిట్టీలు, ఓటర్ లిస్టు జాబితా, ఫ్లెక్సీలు, కరపత్రాలు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్‌రూమ్స్, విద్యుత్ సౌకర్యం, ఫొటోగ్రాఫర్లు, చెకింగ్ స్క్వాడ్స్‌కు సంబంధించిన వాహనాలు ఇలా అన్నింటిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. సహజంగా మండల స్థాయి అధికారులుగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉంటారు. అయితే వీరు నిధుల అకౌంట్ నిర్వహణకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు డీడీవో ఆథరైజేషన్‌ను తమ దిగువ క్యాడర్‌లో ఉన్న అధికారులకు ఇచ్చారు. ఈ వ్యవహారాన్ని గమనించిన ఓ డివిజన్ స్థాయి అధికారి డీడీవో ఆథరైజేషన్ పొందిన ఓ అధికారిని మచ్చిక చేసుకొని, ఎన్నికల నిధులను పక్కదారి పట్టించేందుకు పథకం రూపొందించాడు. డీడీవో పేరిట ఏర్పాటు చేసిన అకౌంట్ నుంచి నిధులను దిగువ స్థాయి అధికారి తన పేరిట తెరిచిన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. అక్కడి నుంచి డివిజన్ స్థాయి అధికారి, మండల అధికారికి దిగువ స్థాయి అధికారి ఇద్దరు నిధులను యథేచ్ఛగా మళ్లించినట్టు సమాచారం. డివిజన్ స్థాయి అధికారి రెండు వాహనాలు ఎన్నికల విధుల్లో పెట్టకుండానే దాదాపు మూడు నాలుగు నెలలు నడిపినట్టు చూపి అద్దె పేరిట లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్లు తెలుస్తున్నది. 2023 ఆగస్టు 6 నుంచి డిసెంబర్ 6 వరకు పోల్ చిట్టీలు, ఓటర్ లిస్టు జాబితా, ఫ్లెక్సీలు, కరపత్రాలు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్‌రూమ్స్, విద్యుత్ సౌకర్యం, ఫొటోగ్రాఫర్లు, చెకింగ్ స్క్వాడ్స్ సేవలను వినియోగించుకున్నారు. వారి వద్ద నుంచి బిల్లులు తీసుకుంటూ వారికి కొంత డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత డివిజన్ స్థాయి అధికారితో పాటు డీడీవోగా ఆథరైజేషన్ పొందిన అధికారి ఇద్దరు ఇతర జిల్లాలకు బదిలీలపై వెళ్లిపోయారు. అయితే ఎన్నికల సమయంలో పనిచేసిన వ్యాపారులు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు చివరి విడుత డబ్బులు ఇవ్వకుండానే వెళ్లిపోయారు. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు భోజనం అందజేసిన హోటల్ నిర్వాహకుడికి ₹2.10 లక్షలు, పోల్‌చిట్టీలు, ఓటర్ జాబితాలు

అసెంబ్లీ ఎన్నికల్లో నిధులు కాజేసిన బాగోతం వెలుగు చూస్తున్నది. ఎలక్షన్ నిర్వహణకు సంబంధించి జగిత్యాల జిల్లాలోని ఓ నియోజకవర్గానికి వచ్చిన డబ్బులను పక్కదారి పట్టించినట్టు తెలుస్తున్నది. డివిజన్ స్థాయి అధికారితోపాటు మరో అధికారి స్వాహా పర్వం కొనసాగించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, అప్పుడు ఎన్నికల కోసం పనిచేసిన హోటల్, జిరాక్స్ షాప్ వ్యాపారులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు లబోదిబోమంటున్నారు. బిల్లుల కోసం ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. శుక్రవారం కూడా జగిత్యాల సబ్ డివిజన్‌లోని ఒక కీలక అధికారి కార్యాలయానికి పలువురు బాధితులు వచ్చి నిరాశగా వెనుదిరిగారు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోసం తాము పనిచేస్తే ఇలా మోసం చేస్తారని అనుకోలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు

జిరాక్స్ చేసిన షాప్ యజమానికి ₹310లక్షలు, ఫ్లెక్సీలు తయారు చేసిన దుకాణదారుడికి ₹3లక్షలు, వాహనదారులకు పెట్రోల్ డబ్బులతో పాటు వాహనాల అద్దెలు ఇలా లక్షలాది రూపాయలు చెల్లించకుండానే బకాయిలు పెట్టారు. దాదాపు నాలుగు నెలల పాటు పనిచేయించుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో ఎన్నికల విధుల్లో కార్యాలయాలకు పనిచేసిన వారంతా ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆఫీసుల్లో సరైన సమాధానం రాక బిత్తరపోతున్నారు. కొద్ది మంది ధైర్యం ఉన్న వాళ్లు కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి తమ బాధను ఉన్నతాధికారులకు మొరపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

యుటిలైజేషన్ సర్టిఫికెట్ సైతం సబ్మిట్ చేయని అధికారులు

నిబంధనల ప్రకారం ఎన్నికలు ముగిసిన తదుపరి నిధులను ఎలా ఖర్చు చేశారన్న వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి అందించాల్సి ఉంటుంది. భోజనాల నుంచి మొదలుకొని జిరాక్స్‌ల వరకు, ఫొటోల నుంచి మొదలు కొని విద్యుత్ సప్లై వరకు దేనికెంత చొప్పున చెల్లించారు? ఎవరెవరికి చెల్లించారు? అన్న వివరాలు, బిల్లులతో సహా సబ్మిట్ చేయాలి. దీన్ని యుటిలైజేషన్ సర్టిఫికెట్‌గా వ్యవహరిస్తారు. అయితే జగిత్యాల జిల్లాలో ఎన్నికల నిధులు స్వాహా చేసిన నియోజకవర్గానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను సదరు అధికారులు ఇప్పటి వరకు సమర్పించలేదు. ఆ సర్టిఫికెట్ లేకపోతే ఎంపీ ఎన్నికలకు సంబంధించిన నిధులు మంజూరు చేయడం ఇబ్బంది అవుతుందని ఉన్నతాధికారులు డివిజన్, మండల స్థాయి అధికారులకు తెలుపగా, నిధుల స్వాహా పర్వం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో అప్పటికప్పుడు మరో అధికారికి బాధ్యతలు అప్పగించి, ఒక యుటిలైజేషన్ సర్టిఫికెట్ తయారు చేయించి ఉన్నతాధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించినట్టు సమాచారం.

చర్యలు శూన్యం!

ఎన్నికల నిధుల్లో పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగిందని, ఇద్దరు అధికారులు పెద్ద మొత్తంలో స్వాహా చేశారన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా ఇంత వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అందరిన ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. బాధితులు పలుసార్లు ఉన్న తాధికారుల వద్దకు వెళ్లి తమకు న్యాయం చేయాలని వేడుకున్నా.. కష్టపడి చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం అడిగినా ఎలాంటి చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కాగా, నిధులు స్వాహా చేసి బదిలీపై వెళ్లిపోయిన వారిలో ఒకరు ఉన్నతాధికారి కావడం, మరో అధికారికి పరపతి ఎక్కువగా ఉండడం కారణంగానే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఒకటి రెండు సార్లు సదరు అధికారులకు ఫోన్ చేసిన ఉన్నతాధికారులు ఆ తర్వాత సైలెంట్ అయిపోయినట్లు సమాచారం. కాగా, ఈ వ్యవహారంపై ఎన్నికల సిబ్బందికి భోజనం సరఫరా చేసిన హోటల్ వ్యాపారి, జిరాక్స్ దుకాణం యజమాని మాట్లాడుతూ.. తమ లాంటి వారు దాదాపు ఇరవై మంది ఉన్నారని చెప్పారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల జాతర

- షెడ్యూల్ విడుదల చేసిన సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 8 నుంచి 22 వరకు ప్రక్రియ
- వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు
- 2023లో బదిలీ అయి నేటికీ అదే స్థానంలో ఉన్న స్కూల్ అసిస్టెంట్‌ల రిలీవ్‌కు ఆదేశాలు
- 5 వేల నుంచి 6 వేల మంది ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం
- 2 వేలకు పైగా ప్రమోషన్లకు చాన్స్
- సజావుగా కొనసాగితే కొత్త ఖాళీలు ఏర్పడే అవకాశం

కరీంనగర్, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతేడాది సెప్టెంబర్‌లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు పచ్చ జెండా ఊపింది. ఆ మేరకు ప్రక్రియను ప్రారంభించింది. స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించింది. అలాగే, స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియను నిర్వహించింది. అందులో కొంత మంది స్కూల్ అసిస్టెంట్లు రిలీవ్ అయి.. విధుల్లో చేరగా, మరికొంత మంది సబ్‌స్టూట్ లేక అదే స్థానంలో కొనసాగారు. ఇదే సమయంలో కొంత మంది కోర్టుకు వెళ్లడంతో ఆనాడు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. నిజానికి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జనవరిలోనే ఈ ప్రక్రియకు పచ్చ జెండా ఊపినా కొన్ని అంశాలను విభేదిస్తూ పలువురు ఉపాధ్యాయులు ఆనాడు సైతం కోర్టుకు వెళ్లడంతో అప్పుడు ఆలస్యం జరిగింది. ఆ తర్వాత కోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకొని గతేడాది సెప్టెంబర్‌లో ప్రక్రియ మొదలు పెట్టినా.. మళ్లీ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వాయిదా పడింది. మళ్లీ ఇప్పుడు కోర్టు క్లియరెన్స్ రావడంతో ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఆదేశాలు జారీ చేసింది.

నేటి నుంచే ప్రక్రియ.. భారీగా బదిలీలు

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నేటి నుంచే ప్రక్రియ ప్రారంభం కానున్నది. దీంతో జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానున్నది. వివిధ కారణాలతో గతేడాది సెప్టెంబర్‌లో ఆగిపోయిన స్థానం నుంచే మళ్లీ ఈ ప్రక్రియ కొనసాగనున్నది. తాజాగా, రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ నెల 8 నుంచి 22 వరకు అంటే పక్షం రోజులపాటు ఈ జాతర జరగనున్నది. అధికారుల అంచనా ప్రకారం చూస్తే.. సుమారు 5 వేల నుంచి 6 వేల మంది టీచర్లకు ట్రాన్స్‌ఫర్లు జరిగే అవకాశం ఉండగా, రెండు వేలకు పైగా టీచర్లకు పదోన్నతులు లభించనున్నాయి. ఈసారి కూడా గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారానే బదిలీల ప్రక్రియ నిర్వహించడానికి ఆదేశాలు ఇవ్వగా.. 2023 సెప్టెంబర్‌లో బదిలీ అయి రిలీవ్ కాకుండా పాత స్థానంలో కొనసాగుతున్న స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్‌చేయడానికి ఆదేశాలు ఇచ్చింది. దీంతోపాటు పదవీ విరమణకు మూడేళ్లలోపు ఉన్న వారికి తప్పనిసరి బదిలీల నుంచి మినహాయింపునిచ్చింది.

జిల్లాలోని వందలాది మంది ఉపాధ్యాయులకు వివిధ గ్రేడ్స్‌లో పదోన్నతులు వరించనున్నాయి. అధికారుల అంచనా ప్రకారం సుమారు రెండు వేలకుపైగా ఉపాధ్యాయులకు వివిధ గ్రేడ్స్‌లో ప్రమోషన్లు రానున్నాయి. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లా మొత్తం మీద 5 వేల నుంచి 6 వేల మంది టీచర్లకు బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లాలో భారీగా బదిలీలు జరిగే అవకాశమే కనిపిస్తున్నది. ఉపాధ్యాయుల బదిలీలు గతంలో 2018లో జరిగాయి. ఆనాటి నుంచి ఉపాధ్యాయుల కోరిక మేరకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. ఏదో ఒక న్యాయపరమైన చిక్కుతో అమలు కాలేదు. చివరకు 2023 జనవరిలోనూ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో రెండు అంశాలపై పలువురు ఉపాధ్యాయుల కోర్టుకు వెళ్లారు. ఫలితంగా దాదాపు ఎనిమిది నెలలుగా ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడిపోయింది. తిరిగి గతేడాది సెప్టెంబర్‌లో కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోనే ఏమాత్రం అలస్యం చేయకుండా ఆనాటి ప్రభుత్వం ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియ సజావుగా సాగుతున్న క్రమంలోనే పలు అంశాలపై మళ్లీ కొంత మంది కోర్టుకు వెళ్లడంతో మధ్యలోనే నిలిచిపోయింది. ఈ పరిణామ క్రమంలో ఈసారి పక్షం రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందా? లేదా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎటువంటి అడ్డంకులూ లేకుండా పూర్తయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలు స్పష్టంగా తెలిసే అవకాశ ముంటుంది. దీంతో ఈ విద్యా సంవత్సరం నడిపేందుకు ప్రభుత్వం వలంటీర్లను నియమించడం లేదా..? ఇతర కార్యక్రమాలు చేపట్టే అంశంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఏర్పడుతుంది. అలాగే, ఒకవేళ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు పూనుకుంటే ఖాళీలు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు పెరగడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

గులాబీ.. హ్యాట్రిక్

- సిరిసిల్ల అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం • బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు • చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు ఏకగ్రీవం • చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ
- వైస్‌చైర్మన్‌గా అడ్డగట్ల మురళి • ఫలించిన కేటీఆర్ వ్యూహం • కృతజ్ఞత చాటిన ఓటర్లు

అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : ఆది నుంచీ గులాబీ కంచుకోటగా ఉన్న సిరిసిల్ల క్షేత్రంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగిరింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ విజయభేరి మోగించింది. తెలంగాణ ఆవిర్భావం నుంచి వరుసగా గెలుస్తూ.. మూడోసారి హ్యాట్రిక్ సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినా.. ఇక్కడ మాత్రం గులాబీదే హవా నడుస్తున్నది. తాజాగా సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటింది. ఐదేళ్లకోసారి జరిగే ఈ పాలకవర్గ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని, పట్టు కోసం విశ్వప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహం ఫలించి, 12 స్థానాల్లో ఎనిమిదింటిని అభ్యర్థులే కైవసం చేసుకుని బీఆర్ఎస్ సత్తా చాటింది. గురువారం జరిగిన అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో 12 డైరెక్టర్ స్థానాల్లో 8 స్థానాలను గెలుచుకోగా, శుక్రవారం బ్యాంకు కార్యాలయంలో చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా చైర్మన్ స్థానానికి రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ స్థానానికి అడ్డగట్ల మురళి నామినేషన్ దాఖలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు బలపరిచిన అభ్యర్థుల నుంచి నామినేషన్ దాఖలు కాకపోవడంతో.. చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌గా అడ్డగట్ల మురళి ఏకగ్రీవమయ్యారు. సహకార సంఘాలలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఇప్పటి వరకు మూడుసార్లు గులాబీ పార్టీ అభ్యర్థులకే ఓటర్ల పట్టం కడుతూ వస్తున్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఎన్నికైన అభ్యర్థులకు కేటీఆర్ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఇటు చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు డైరెక్టర్లందరినీ ఒకే వాహనంపైకి చేర్చి సిరిసిల్ల పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. గాంధీ, అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు పూలమాల వేశారు. గెలిచిన అభ్యర్థులందరికీ పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గాజుల నారాయణ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేస్తాం

పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

- జూలై చివరిలోగా మల్టీపర్పస్ స్కూల్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం
- శివారు డివిజన్లలో ₹147 కోట్లతో మంచినీటి పనులు • కరీంనగర్ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 7 : కరీంనగర్‌లో వివిధ నిధుల కింద చేపట్టిన పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. స్మార్ట్‌సిటీ నిధులతో మల్టీపర్పస్ స్కూల్ మైదానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను జూలై చివరి నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కరీంనగర్ మల్టీపర్పస్ స్కూల్ మైదానంలో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులు ₹5.50 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో ₹2 కోట్లతో మ్యూజికల్ పౌంటేన్, ₹1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, ₹50 లక్షలతో పిల్లల ఆడుకునేందుకు అవసరమైన వస్తువులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఓపెన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం పిల్లలు, పెద్దలు సేదతీరే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ తీరు వల్ల గతంలో నెమ్మదిగా పనులు సాగినా ఇప్పుడు వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ఎన్నికల కోడ్‌కు ముందు ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులను రెండు రోజుల్లో ప్రారంభించి, వర్షాలకు ముందుగానే పూర్తి చేస్తామన్నారు. ఈ వానకాలంలో నగరంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా డీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధంగా ఉంచామన్నారు. హెల్ప్ లైన్ నంబర్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని, వానకాలంలో వచ్చే అన్ని సమస్యలపై ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయిస్తున్నామన్నారు. నగరంలో విలీనమైన గ్రామాల పరిధిలోని డివిజన్లలో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేసేందుకు ₹147 కోట్లతో టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఈ పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి ప్రత్యేకంగా 10 ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్ నిర్మిస్తున్నామని, రిజర్వాయర్లు, మంచినీటి పైపులైన్ల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. ఎల్ఎండీలో 10 టీఎంసీల నీటి నిల్వ ఉంటే నగరంలో ఎప్పటి విధంగా రోజూ మంచినీటి సరఫరా చేస్తామన్నారు. స్మార్ట్‌సిటీతో చేపడుతున్న చౌరస్తాల సుందరీకరణ పనులను ఒక్కొక్కటి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అఖిల్, శ్రీకాంత్, మహేశ్, నాయకులు కోల సంపత్, బాలయ్య, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈ యాదగిరి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

10 నుంచి టీజీ పీజీసెట్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, జూన్ 7 : తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024(టీజీ పీఈ సెట్) శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు టీజీ పీజీ సెట్-2024 కన్వీనర్ ఆచార్య రాజేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు దాదాపు 2400 వరకు మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికి ఈ నెల 10 నుంచి 13 వరకు శాతవాహన విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానంలో శరీర దారుఢ్య సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు వివిధ క్రీడాంశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు ఉంటాయని చెప్పారు. హాల్ టికెట్లను https://pecet.tsche.ac.in/ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు హాజరయ్యే దూరప్రాంత విద్యార్థులకు యూనివర్సిటీలో వసతి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాజరు కావాలని సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ జట్టు ఎంపిక పోటీలు

కోల్‌సిటీ, జూన్ 7: రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పాల్గొనేందుకు ఆది వారం గోదావరిఖనిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి టీ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక జవహర్‌నగర్‌లోని జేఎల్ఎన్ స్టేడియంలోని ఈత కొలనులో జరిగే ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఆసక్తి గల స్విమ్మింగ్ క్రీడాకారులు హాజరు కావాలని సూచించారు. జూలై 23వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ ఈత పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆ పోటీలకు అర్హత సాధించేందుకు ఉమ్మడి జిల్లా నుంచి జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు
పొలిటికల్
స్వదేశాగమనం
లీగల్ ప్రకటనలు
క్లాస